## సమస్యలను పరిష్కరించండి



కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని వివిధ కాలనీలు, బస్తీలకు చెందిన ప్రజలు,సంక్షేమ సంఘాల ప్రతినిధులు,బీఆర్ఎస్ కార్యకర్తలు,నేతలు శనివారం ప్రభుత్వవిప్,ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఎమ్మెల్సీ,మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు శంభీపూర్‌రాజును ఆయన కార్యాలయం వద్ద కలిశారు.ఈ సందర్భంగా తమ ప్రాంతాల్లో నెలకొన్న సమస్యలపై దృష్టిసారించాలని కోరగా రాజు సానుకూలంగా స్పందించినట్లు వారు తెలిపారు. –దుండిగల్,నవంబర్4:

## రెండు నామినేషన్లు దాఖలు

మియాపూర్ ,నవంబరు 4 : శేరిలింగంపల్లి నియోజకవర్గ స్థానానికి నామినేషన్ దాఖలు రెండో రోజుకు చేరింది. ఈ ప్రక్రియలో భాగంగా శనివారం స్వతంత్ర అభ్యర్థులు మహ్మద్ పాషా , రామోజు ఆకర్షలు తమ నామినేషన్‌లను మధ్యాహ్నం 1.30 గంటల సమయంలో ఎన్నికల రిటర్నింగ్ అధికారి శ్రీనివాసరెడ్డికి అందించారు . ఆదివారం సెలవును పురస్కరించుకుని నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ ఉండదని ఆర్వో తెలిపారు. కాగా నామినేషన్ల స్వీకరణ నేపథ్యంలో ఇక్కడి ఆర్వో కార్యాలయం వద్ద పటిష్ట బందోబస్తును చేపట్టారు.

## ఆంజనేయస్వామి ఆలయంలో పూజలు




పూజల్లో పాల్గొన్న కౌన్సిలర్ శంభీపూర్‌కృష్ణ

దుండిగల్,నవంబర్4: ఉమ్మడి మెదక్ జిల్లా, నర్సాపూర్ సమీపంలోని శ్రీ చాకరి మెట్ల ఆంజనేయ స్వామి ఆలయాన్ని కుత్బుల్లాపూర్ నియోజకవర్గం బీఆర్ఎస్ నాయకులు, దుండిగల్ మున్సిపాలిటీ కౌన్సిలర్ శంభీపూర్ కృష్ణ శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం స్వామివారి కృపకటాక్షంతో ప్రజలంతా సుఖంగా ఉండేలా చూడాలని అమ్మవారిని కోరుకున్నట్లు తెలిపారు. పలువురు పార్టీనేతలు,భక్తులు ఉన్నారు.

# అభివృద్ధిని చూసి ఓటు వేయండి

- ఇంటింటికీ ప్రచారంలో బీఆర్ఎస్ అభ్యర్థి అరెకపూడి గాంధీ సతీమణి శ్యామల దేవి



మైత్రీనగర్‌లో ఇంటింటికీ ప్రచారంలో పాల్గొని కరపత్రాన్ని అందజేస్తున్న అరెకపూడి గాంధీ సతీమణి

మాదాపూర్, నవంబర్ 4 : అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా బీఆర్ఎస్ ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టిందని బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి అరెకపూడి గాంధీ సతీమణి అన్నారు. హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలోని మైత్రీ నగర్ కాలనీలో స్థానిక పార్టీ మహిళలతో కలిసి శనివారం ఇంటింటికీ తిరిగి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అభివృద్ధి, సంక్షేమాలకు బీఆర్ఎస్ ప్రభుత్వం కేరాఫ్‌గా నిలుస్తుందన్నారు. ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి బీఆర్ఎస్‌కు మద్దతు తెలుపుతున్నారన్నారు. శేరిలింగంపల్లి నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి పథంలో ముందుకు తీసుకువెళ్తున్న అరెకపూడి గాంధీని ముచ్చటగా మూడోసారి గెలిపించాల్సిందిగా ప్రజలను కోరారు. బస్తీలు, కాలనీలు అనే తేడా లేకుండా ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలను ప్రజలకు పూర్తి స్థాయిలో అందుబాటులోకి తీసుకువచ్చిన ఘనత ఎమ్మెల్యే అభ్యర్థి గాంధీదేనన్నారు. వంట సిలిండర్ ధరను రూ. 400లకే బీఆర్ఎస్ ప్రభుత్వం అందించడం మహిళలకు ఉపశమనమని అన్నారు.

## అలరించిన గాత్ర, నృత్య ప్రదర్శనలు



నృత్య ప్రదర్శనలిస్తున్న కళాకారులు

కొండాపూర్, నవంబర్ 4 : వారాంతపు సాంస్కృతిక ప్రదర్శనల్లో శనివారం మాదాపూర్‌లోని శిల్పారామంలో పలువురు కళాకారులు గాత్ర, నృత్య ప్రదర్శనలతో ఆద్యాంతం ఆకట్టుకున్నారు. సుమధుర సంగీత స్వరధరా సంగీత కళాకారులు తమ గాత్ర కచేరితో సందర్శకులకు ఆహ్లాదాన్ని పంచారు. గరుడగమనా, సువ్వి సువ్వి, జయ జయ, కళ్యాణ గుణనిధి కీర్తనలను ఆలపించారు. అనంతరం తిల్లాన ఆర్ట్స్ అకాడమీ గురువులు మాధవి మారెళ్లపూడి తన శిష్య బృందంతో కలిసి భరతనాట్య నృత్యాలతో ఆకట్టుకున్నారు. ప్రదర్శనల్లో ఆభా, ఆస్మి, ఆర్య, ఆజ్ఞ, చేతన, సాయి, వేదంశి, సమృద్ధి, స్వేచ్ఛలు తోడయా మంగళం, జయ జయ స్వామిన్, ఆండాళ్ కౌత్వం, నటనమాడిన, భరో కృష్ణయ్య, సింహాసనస్తుతి, కీర్తన, రారవేను గోపబాల, తిల్లాన అంశాలను భరతనాట్య నృత్యరూపకంలో ప్రదర్శించి మెప్పించారు.

## ఆర్ట్ గ్యాలరీలో చిత్ర ప్రదర్శన



చిత్రాలను తిలకిస్తున్న ప్రముఖులు

కొండాపూర్, నవంబర్ 4 : మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో శనివారం ప్రముఖ చిత్రకారుడు ఆర్ సుభాశ్ బాబు ' ప్రొఫిషెన్సీ విద్ జీల్ సోలో షో' పేరిట సోలో చిత్ర ప్రదర్శనను ఏర్పాటు చేశారు. చిత్ర ప్రదర్శనను మాజీ కేంద్ర మంత్రి రాజు ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించి, ప్రదర్శనలో ఉంచిన చిత్రాలను తిలకించారు. చిత్రాల విశిష్టతను చిత్రకారుడిని అడిగి తెలుసుకున్నారు. ప్రదర్శన నవంబర్ 8వ తేదీ వరకు కొనసాగుతుందని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాడి కట్టమంచి, ఎండీ రావు, ఎస్ఎం పీరన్, ఎంవీ రమణరెడ్డి, ఎం శంకర్, వర ప్రసాద్, ఇతర కళాకారులు పాల్గొన్నారు.

# ఇక సాఫీగా ప్రయాణం

- రూ. 500 కోట్లతో అంతర్గత రహదారుల అభివృద్ధి



జేపీనగర్‌లో నూతనంగా వేసిన బీటీరోడ్డు

మియాపూర్ , నవంబరు 4 : రాష్ట్రంలోనే అతి పెద్దదైన శేరిలింగంపల్లి నియోజకవర్గంలో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం పెద్ద పీట వేసింది. ప్రధానంగా ఐటీ పరిశ్రమలు అత్యధికంగా ఈ నియోజకవర్గంలో ఉండటం....దేశంలోని అన్ని రాష్ట్రాల ప్రజలు నివసించే మినీ భారత్‌గా పేరు ప్రఖ్యాతులు రావటంతో ....అధిక మొత్తంలో నిధులను వెచ్చించి ప్రజా సౌకర్యానికి అధిక ప్రాధాన్యతనిచ్చింది. ఉమ్మడి పాలనలో అస్తవ్యస్థమైన రహదారులతో కాలనీలలో ప్రయాణం నరక ప్రాయంగా మారిన తరుణంలో...స్వపాలనలో ఆ కష్టాలకు చెల్లుచీటి పెట్టి....ప్రధానంగా అంతర్గత రహదారులను విస్తృతంగా నిర్మించింది. నియోజకవర్గంలోని కూకట్‌పల్లి, వివేకానందనగర్, హైదర్‌నగర్, ఆల్విన్ కాలనీ, మియాపూర్, చందానగర్, హఫీజ్‌పేట్, మాదాపూర్, కొండాపూర్, గచ్చిబౌలి, శేరిలింగంపల్లి డివిజన్‌లలో ఈ తొమ్మిదేండ్ల కాలంలోనే సుమారు రూ .500 కోట్లను వెచ్చించి కాలనీలలో అంతర్గత రహదారులను తీర్చిదిద్ది మెరుగైన ప్రయాణ సౌకర్యాన్ని సర్కారు కల్పించింది. నియోజకవర్గ శాసన సభ్యుడు,విప్ ఆరెకపూడి గాంధీ ఎప్పటికప్పుడు డివిజన్‌లలో ప్రతినిధులు, కాలనీ సంఘాలతో సమావేశాలు నిర్వహించి అభివృద్ధి పరచాల్సిన అంతర్గత రహదారులపై క్షేత్రస్థాయి నుంచి నివేదికలను రూపొందించుకుని.....ఇంజినీరింగ్ విభాగంతో సమన్వయంతో ముందుకు సాగారు. నివేదికలను ప్రభుత్వం దృష్టికి కేటీఆర్ దృష్టికి తీసుకెళ్లి అధిక మొత్తంలో నిధులను సమకూర్చుకుని కాలనీలలో అంతర్గత సీసీ , బీటీ రహదారుల నిర్మాణాలను చేపట్టారు. విస్తరిస్తున్న కాలనీలు, పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా సింహభాగం రహదారుల నిర్మాణాలను పూర్తి చేయటంతో ...నియోజకవర్గంలోని ప్రతి కాలనీలో మెరుగైన రవాణాను ప్రజలు ఆనందిస్తున్నారు.

**తొమ్మిదేండ్లుగా ఎంతో అభివృద్ధి..**

శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని పదిన్నర డివిజన్‌లలో అంతర్గత రహదారుల పరిస్థితి గడచిన తొమ్మిదేండ్లుగా ఎంతో మెరుగు పడింది. అస్తవ్యస్త రహదారులు, గతుకుల దారులతో కాలు మోపాలంటేనే జంకే పరిస్థితి నుంచి హాయిగా ప్రయాణించే స్థాయికి ఎమ్మెల్యే గాంధీ అంతర్గత రహదారుల మెరుగుకు కృషి చేశారు. ఈ తొమ్మిదేండ్ల కాలంలో రూ. 500 కోట్లను వెచ్చించి విస్తృతంగా సీసీ , బీటీ రహదారుల నిర్మాణాలను పూర్తి చేయించారు. అత్యంత ప్రధానంగా నియోజకవర్గంలోని ఆల్విన్ కాలనీ డివిజన్‌లో 60 శాతానికి పైగా మురికివాడలుండగా.....వాటిల్లో 90 శాతానికి పైగా పక్కా అంతర్గత రహదారుల నిర్మాణాలను చేపట్టారు. ఇదే విధంగా అస్తవ్యస్త రహదారులున్న హఫీజ్‌పేట్, చందానగర్, కొండాపూర్ , హైదర్‌నగర్ , లింగంపల్లి డివిజన్‌లలోని కాలనీలలో వందలాది కిలో మీటర్ల మేర అంతర్గత రహదారులు అందుబాటులోకి వచ్చాయి. తద్వారా ఇబ్బందులు దాటి సాఫీ ప్రయాణాన్ని ప్రజలు సైతం ఆనందిస్తున్నారు. శేరిలింగంపల్లి నియోజకవర్గ అభివృద్ధి కోసం అహర్నిషలు కృషి చేస్తున్నట్లు, ప్రజలకు పూర్తి స్థాయిలో మౌలిక వసతుల కల్పనకు ప్రణాళికా బద్ధంగా ముందుకు సాగుతున్నట్లు విప్ గాంధీ తెలిపారు.